క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న సాయిరెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండలం కోలుకులపల్లిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అభివృద్ధి పనులకు గాను గ్రామానికి చెందిన బొజ్జ సాయిరెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్ రెడ్డికి సాయిరెడ్డి ఈ విరాళాన్ని అందజేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని ఎంపీటీసీ సభ్యుడు కిషన్ రెడ్డి తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలు, తండాల అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్లకుంట తండాలోని పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి తన ఎమ్మెల్యే నిధుల నుంచి డబ్బులు మంజూర్ చేశాడని, అట్టి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. రమావత్ భాస్కర్, పాత్లావత్తు రాజు, డాక్టర్ హేంలాల్, బీంలాల్, చంద్రు, కిషన్, జగదీశ్, దశరథం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ప్రజావైద్యశాలలో శుక్రవారం హైదరాబాద్ శ్రీ రాఘవేంద్ర ఫర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కమిటీ సహకారంతో నిర్వహించిన ఉచిత మహిళా వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో మహిళా వైద్యురాలు డా.పంతంగి జ్యోతిష్మతి శర్మ ఆధ్వర్యంలో 120 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, స్థానిక వైద్యులు విశ్వేశ్వర్, లోకేశ్వర్, డా.నయనాచారి, టీఎస్ఎస్ఓ నాయకులు వంశీ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలపై పోరాటం

సంఘం నూతన అధ్యక్షుడు భిక్షపతి



కమిటీ సభ్యులను సన్మానించిన అతిథులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి తెలిపారు. నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా రావుల యాదగిరి, కానమోని గణేశ్, ప్రధాన కార్యదర్శిగా కావలి నర్సింహ, కోశాధికారిగా చక్రపాణితో పాటు 25 మంది సభ్యులతో నూతన కమిటీని వేసినట్లు తెలిపారు. ఈ నియోజకవర్గ కమిటీలో ఇబ్రహీంపట్నం, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల మండలాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రావనమోని లింగం, నీలం శ్రీకాంత్, కావలి శ్రీశైలం, సత్తయ్య సభ్యులుగా ఉంటారని, సలహాదారులుగా మరో ఐదుగురిని నియమించినట్లు తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఎ గ్రూప్‌లోకి మార్చేందుకు భవిష్యత్‌లో ఉద్యమించనున్నట్లు భిక్షపతి తెలిపారు.

నియామకం



పురుషోత్తం

తుర్కయంజాల్: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌కు చెందిన కొండ్రు పురుషోత్తంను నియమిస్తూ ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు పురుషోత్తం కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఆలయంలో సమస్యల తిష్ట

- అభివృద్ధికి నోచుకోని మల్లికార్జున స్వామి ఆలయం
- మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక భక్తుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తలకొండపల్లి: జిల్లాలోని తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం శివారు ప్రాంతంలో మల్లప్పగుట్టపై మల్లికార్జునస్వామి శివాలయం ఉంది. మొదట ఈ ఆలయం చిన్నదిగా ఉండేది. 8 సంవత్సరాల కితం శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ క్రియాశీలక కార్యవర్గ సభ్యులు విరాళాలు సేకరించి దాతల సహాయంతో నూతనంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, ఏనుగు విగ్రహాలు, 100 ఫీట్ల వైశాల్యంతో విశాలమైన కల్యాణ మండపం, వసతి గృహాల సముదాయం, కిచెన్ షెడ్, గుట్ట కింది భాగం నుంచి పైభాగం వరకు భక్తులు వెళ్లడానికి చక్కని రహదారి, వాటర్ ట్యాంక్, తదితర వాటిని నిర్మించారు. కోరిన కోర్కెలు నెరవేర్చే స్వామిగా ప్రసిద్ధి పొందడంతో భక్తులు తండోపతండాలుగా తరలివస్తుంటారు. నాటి నుంచి నేటి వరకు నిత్య పూజలు జరుగుతున్నప్పటికీ అనుకున్నంత వేగంగా ఆలయాభివృద్ధి జరుగడంలేదు. ఆలయంలో పలు సమస్యలు పేరుకుపోయాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు మాకం పాండయ్య తెలిపారు.

స్నానపు గదులు, మూత్రశాలలు లేవు..

ఆలయ పై భాగంలో సీసీరోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ భవనాలు, గుట్ట కింది భాగం నుంచి పై భాగం వరకు నిర్మించిన రహదారికి ఇరుపైపులా వీధిలైట్లు, గుట్ట కింది, పై భాగంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, వంటశాలలు తదితర వాటిని నిర్మించాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఆలయ సమస్యలు పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



భక్తుల కొంగు బంగారమైన ఈ దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఆలయ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుపోయాం. అవసరమైన నిధులు మంజూర్ చేయాలని కూడా కోరాం. ఈ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసినట్‌లైతే మరింత అభివృద్ధి చెందుతుంది.

– పాండయ్య, మల్లప్పగుట్ట ఆలయ కమిటీ అధ్యక్షుడు, చుక్కాపూర్

పాఠశాలకు భూమి కేటాయించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధన్‌రాజ్ గౌడ్, వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ఈ పాఠశాలకు పీఎం శ్రీ పథకం క్రింద రూ.54 లక్షలు మంజూరయ్యాయని, ఇకనుంచి వరుసగా నాలుగేళ్ల ప్రతి ఏటా రూ.50లక్షలు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాల ఉన్న భవనం కేవలం 150 గజాల్లో మాత్రమే ఉందని, పాఠశాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని 2 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



ఎంపీడీఓ శ్రీనివాస్‌ను సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

మంచాల: మంచాల మండల ఎంపీడీఓగా గత ఐదేళ్లుగా పనిచేసి ఇటీవల యాదాద్రికి బదిలీ అయిన చిలుకూరి శ్రీనివాస్‌ను శుక్రవారం మండల కార్యాలయంలో తోటి ఉద్యోగులు, నాయకులు ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధిలో ఆయన తనదైన ముద్రవేశారన్నారు. ఉద్యోగం అన్నాక బదిలీలు సహజం అని ఎక్కడికి వెళ్లినా మంచిపేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ నర్మద, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఎంపీడీఓ బాలశంకర్, డీఈఈ అబ్బాస్, ఎంపీఓ తేజ్‌సింగ్, ఏపీఓ వీరాంజనేయులు, ఏపీఎం శోభ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కడ్తాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా చేతన్, ఆర్‌జేడీగా వెంకి, కలెక్టర్‌గా ప్రశాంత్, డిప్యూటీ కలెక్టర్‌గా సందీప్, డీఈఓగా శ్రీకాంత్, ఎంఎన్ఓగా సిద్ధార్ధ్, ఎంఈఓగా రామ్‌రాజ్ వ్యవహరించగా, మరో 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తమ తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రత్నమాల, రాఘవేంద్రచారి, పీడీ చంద్రమోహన్, కౌసల్య, శ్వేతామాధురీ, గోవర్ధన్, భాస్కర్‌రావు, జంగయ్య, మల్లయ్య, సునీత, శైలజ, శోభరాణి, హేమలత, రవిప్రకాశ్‌రావు, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన కాసోజు ప్రమోద్ కూతురు తన్విశ్రీ గుండె ఆపరేషన్ నిమిత్తం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.2.5 లక్షలు ఎల్ఓసీ చెక్కు మంజూరైంది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ఎల్ఓసీ చెక్కును తన్విశ్రీ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నితిన్‌రెడ్డి, తిరుమలేశ్, ప్రశాంత్, శ్రీను, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



భూమిపూజ చేస్తున్న మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామ పంచాయతీలో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం రావిచేడ్‌లో 3 కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని వారు కోరారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, ఎంపీటీసీ గోపాల్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు యాదయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్, అంజయ్య, రమేశ్, పారేశ్, శంకరయ్య, వెంకటేశ్, సంతోష్, మల్లయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణలో నిర్లక్ష్యం

ప్రమాదాలబారిన వాహనదారులు



గండిమైసమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై ప్రమాదకరంగా ఇనుప చువ్వలు

అబ్దుల్లాపూర్‌మెట్: ఏడాది కాలంగా కొనసాగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ స్పష్టంగా కనిపిస్తోంది. రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రదేశంతో పాటు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో సూచిక, హెచ్చరిక బోర్డులు పెట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు పక్కనే సర్వీస్ రోడ్డుకు ఆనుకుని పెద్దపెద్ద గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు పలు ప్రాంతాల్లో ఇనుప చువ్వలను ప్రమాదకరంగా వదిలివేశారు. ఈ విషయమంపై సంబంధిత ఎన్‌హెచ్ఏఐ అధికారులు దృష్టి సారించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలిని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన 2వ వార్డు మాజీ సభ్యుడు గూడెపు సాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి శ్రీనివాస్‌రెడ్డి రూ.4 వేలు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింటహారెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మల్లయ్య, నర్సింహ, శ్రీను, శ్రీకాంత్, జంగయ్య, రమేశ్, అజయ్, రాంచంద్రయ్య, పెంటయ్య, రాములు, రమేశ్, లాయక్‌అలీ, అశోక్, వెంకటేశ్, మహేశ్ స్థానిక నాయకులు ఉన్నారు.

ఐశ్వర్య కుటుంబాన్ని ఆదుకుంటాం

తలకొండపల్లి: రాజమోని ఐశ్వర్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని శతాబ్ది టౌన్‌షిపు ప్రొప్రైటర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన రాజమోని ఐశ్వర్య అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం ఐశ్వర్యను పరామర్శించారు. కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.10,000 శ్రీశైలం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా వెంకటాపూర్‌తండాలో ఇటీవల మృతి చెందిన బావోజీ కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయాన్ని శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రామస్వామి, భిక్షపతి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండలం అందుగులలో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ పద్మారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో అందుగుల గ్రామానికి రూ.10లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు. అలాగే అందుగుల గ్రామ పరిధిలోని అంతంపేట రూ.5లక్షలు, కుబ్యతండాకి రూ.10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు రమేష్, శ్రీను, పర్వతాలు, అందుగుల రాజు, వెంకటయ్య, పెంటయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని పెద్దతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా శ్రీలక్ష్మి, ఎంఈఓగా నితిక్ష, ప్రధానోపాధ్యాయురాలిగా మేనక వ్యవహరించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు రాంజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య



పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని పోస్టు ఆఫీస్ వద్ద పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య తెలిపారు. పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు, వికలాంగులను ఉదయం 7 గంటల నుంచి సాయింత్రం వరకు ఎండలో నిలబెట్టడం దారుణం అని, ఇదేంటని ప్రశ్నించిన వారిపై సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫించన్‌దారులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు, నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్న సిబ్బందిపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని యాదయ్య కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు జంగయ్య మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. టీపీఎస్ ఎదురుగా కొందరు అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ మున్సిపాలిటీ నిధులకు గండికొడుతున్నారని తెలిపారు. వారిపై తగిన చర్యలు తీసుకొవాలని కోరారు. స్పందించకపోతే జిల్లా కలెక్టర్, సీడీఎంఏ అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

కనులపండువగా కల్యాణోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవస్థానంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఉత్సవాలు రెండు రోజులగా వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో అగ్నిగుండ కార్యక్రమం, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ పర్యవేక్షకుడు రాజేశ్ స్వామి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రభులింగం, డాక్టర్ రమేశ్, సర్వేశ్, వెంకటేశ్‌గుప్తా, మల్లేశ్, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, బుచ్చప్ప, మల్లేశ్, వీరేశ్, సంతోష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో..

కడ్తాల్: మండల కేంద్రంలో కొలువైయున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో వేద పండితుడు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం నిర్వహించారు. స్థానిక సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ చైర్మన్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శాయిరెడ్డి, అశోక్‌రెడ్డి ఆలయ అర్చకులు శ్రీధర్, శ్రీమన్నారాయణ, పవన్‌కల్యాణ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించండి



మాట్లాడుతున్న సత్యనారాయణ రెడ్డి

తుర్కయంజాల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన తుర్కయంజాల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు పర్యావరణం, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఎండాకాలంను దృష్టిలో ఉంచుకొని కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎండలో ఎక్కువ సమయం పనిచేస్తే డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఓఆర్ఎస్ ద్రావణం, తాగునీటి బాటిల్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, వినయ్, ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్లపై అదనపు వసూలు

కందుకూరు: మహేశ్వరంలో స్టాంప్ పేపర్లను అసలు ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారుల ఫోరం మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి తాళ్ల అంజయ్య వాపోయారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు స్టాంప్ వెండర్ల వద్ద తను స్టాంప్ పేపర్లను కొనుగోలు చేశారన్నారు. అక్కడ రూ.20ల స్టాంప్ పేపరు రూ.40లకు, రూ.100లది రూ.130ల చొప్పున విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో సదరు అమ్మకందారుని ప్రశ్నిస్తే ఇదంతా మామూలేనని బదులిచ్చినట్లు ఆయన చెప్పాడు. ఈ విషయంలో పేదలు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనంగా విక్రయించే స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ గురుకులంలో చర్మ వ్యాధులు!

- పట్టించుకోని నిర్వాహకులు, అధికారులు
- నిర్వాహకులను నిలదీసిన ఎంపీపీ మంద జ్యోతి
- సత్వరమే వైద్యం చేయించాలని ఆదేశం



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ మంద జ్యోతి

కందుకూరు: బైరాగిగూడ పరిధిలోని నిషితా ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ బీసీ వెల్ఫేర్ గురుకులలో పాఠశాల, కళాశాల విద్యార్థులు చర్మ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కందుకూరు, చాంద్రాయణ గుట్ట గురుకుల పాఠశాలలతో పాటు చాంద్రాయణ గుట్ట, కార్వాన్, రాజేంద్రనగర్‌కు చెందిన ఇంటర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. అక్కడ సుమారు 1,060 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో ఇక్కడ చర్మవ్యాధ్యులు సోకడంతో చాలా మంది ఇళ్లకు వెళ్లి చికిత్సలు చేయించుకుని తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యను అడిగితెలుసుకున్నారు. సుమారు 200నుంచి 300మందికి గజ్జి, తామర వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు వారు గుర్తించారు. భోజనశాల, మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని చూసి నిర్వాహకుల్ని నిలదీశారు. విద్యార్థులకు చర్మ సమస్యలు వ్యాపిస్తుంటే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయించి చికిత్సలు అందించేలా చూస్తానని ఎంపీపీ విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ గురుకులాలు, విద్యా సంస్థల్లో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేదిలేదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట మండల నోడల్ అధికారి నర్సింహా పాల్గొన్నారు.